# పల్లెకు పట్టణ సొబగులు

- అభివృద్ధితో మారిన వీణవంక గ్రామ రూపురేఖలు
- రూ.2 కోట్లతో వీధివీధినా అద్దాల్లాంటి సీసీ రోడ్లు, డ్రైనేజీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వీణవంక బస్టాండ్ - ఎంపీడీవో కార్యాలయ మార్గంలో వేసిన సీసీ రోడ్లు, ఏర్పాటు చేసిన ఆర్చీ

వీణవంక, అక్టోబర్ 25: వీణవంక మండలంగా ఏర్పడి సుమారు ఆరు దశాబ్దాలు గడిచినా ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగగా, గ్రామంలో కనీస మౌలిక వసతులు సైతం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక గ్రామం ప్రగతి బాట పట్టింది. నేడు పట్టణ స్థాయి సౌకర్యాలతో ఆదర్శంగా నిలిచింది.

నాడు వీణవంక గ్రామంలో వాడవాడలా ఉన్న మట్టిరోడ్లు వర్షాలు పడితే చిత్తడిగా మారేవి. సరైన మురుగు నీటి పారుదల (డ్రైనేజీలు) సౌకర్యం లేక ఇండ్లల్లోకి నీళ్లు చేరడంతో పాటు, బయట కాలుపెడితే మోకాళ్లలోతు నీళ్లు ఉండేవి. వర్షాకాలం వస్తే విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే రోడ్లపై ఎక్కడ గుంతలు ఉన్నాయో, ఎక్కడ రోడ్డు ఉందో తెలువని పరిస్థితి ఉండేది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఊరిమీది వరదంతా లోతట్టు ప్రాంతాలకు చేరేది.


వీణవంక ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

## మారిన పరిస్థితులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసినప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం వల్ల మండల కేంద్రం ఊహించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదు. పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా, మండలి విప్‌గా బాధ్యతలు చేట్టాక మండల కేంద్రం గురించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. గ్రామంలోని సుమారు 12 వార్డుల్లో రూ.2 కోట్లతో 100కు పైగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. దీంతో కాలికి మట్టి అంటకుండా ప్రజలు సాఫీగా రాకపోలు సాగిస్తున్నారు. బస్టాండ్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో 'ఐ లవ్ వీణవంక' ఆర్చీని ఏర్పాటు చేయడంతో మండల కేంద్రానికి పట్టణ సొబగులు వచ్చాయని వీణవంక గ్రామస్తులతో పాటు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మా గ్రామం పట్టణంలా కనిపిస్తున్నది



గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్డు కనబడకూడదనే ఉద్దేశంతో ప్రజల సౌకర్యం కోసం 12 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సహకారంతో మండల కేంద్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం. సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు రూ.20 లక్షలతో హైమాస్ లైట్లు, ఐ లవ్ వీణవంక ఆర్చీ ఏర్పాటు చేయడంతో మా గ్రామం పట్టణంలా కనబడుతున్నది. మండల కేంద్రాన్ని ఇంత అద్భుతంగా తీర్చిదిద్దడానికి సహకరించిన సీఎం కేసీఆర్, మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

*- నీల కుమారస్వామి, సర్పంచ్ (వీణవంక)*

### అన్ని సౌకర్యాలు కల్పించారు



ఒకప్పుడు వాన పడితే మురుగు నీళ్లు ఇండ్లల్లోకి అచ్చేటియి. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కృషితో గ్రామంలో ఎంతో అభివృద్ధి జరిగింది. రూ.లక్షలతో ప్రభుత్వ కార్యాలయాలు, విశాలమైన రోడ్లు నిర్మించారు. విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించారు. ప్రజలకు అవసరమైన ప్రతి పనీ చేశారు. అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

*- తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్, వార్డు సభ్యుడు (వీణవంక)*

# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


జాగీర్‌పల్లిలో మాట్లాడుతున్న ఇంద్రనీల్ బాబు

- ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి
- బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- పార్టీ యూత్ రాష్ట్ర నాయకుడు ఇంద్రనీల్ బాబు

సైదాపూర్, అక్టోబర్ 25: ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, బీఆర్ఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పార్టీ యూత్ రాష్ట్ర నాయకుడు వొడితల ఇంద్రనీల్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఆరెపల్లి, జాగీర్‌పల్లి గ్రామాల్లో బూత్ కమిటీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలందరికీ న్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించడంతో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యకర్తలు ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. గత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్ నిరంతరం అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నియోజకవర్గం నేడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సతీశ్‌కుమార్‌కు మద్దతునివ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్, సర్పంచులు అబ్బిడి పద్మారవీందర్ రెడ్డి, తొంట కాంతమ్మ, ఆవునూరి పాపయ్య, నాయకులు తొంట రజనీకాంత్, ఏశిక ఐలయ్య, పోలుదాసరి ప్రవీణ్, బొల్లవేని శంకర్, పోతిరెడ్డి హరీశ్‌రావు, బత్తుల లక్ష్మీరాజం, మాదం స్వామి యాదవ్, తాళ్లపల్లి నరేశ్, దూల సురేశ్, వర్నె మోహన్‌రావు, వెంగల రవి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

# బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

కమలాపూర్, అక్టోబర్ 25: మండలంలోని కన్నూరు గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బుధవారం హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు వెల్లడించారు. నూనె మధు, నాగరాజు, పిట్టల నరేశ్, బిల్లరాజు, తౌటం శ్రీరాం, రాకేశ్, వినయ్, చందర్‌తో పాటు 50మంది బీజేపీకి చెందిన యూత్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరగా, కౌశిక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లూరి రాంచందర్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణ రావు తదితరులున్నారు.


సైదాపూర్‌క్రాస్ రోడ్ నుంచి వేసిన నూతన సీసీరోడ్డు

# రోడ్డు వచ్చింది.. సమస్య తీరింది!


ఏకలవ్యకాలనీలో ఉప ఎన్నికల ముందు మట్టి రోడ్డు

### 15 రోజుల్లోనే సీసీరోడ్డు వేయించారు



గత పుష్కరకాలంగా మేము ఈ కాలనీలో నివసిస్తున్నాం. కాలనీకి వెళ్లేందుకు సరైన రోడ్డు లేక వానకాలంలో మోకాలు లోతు బురదతో వాహనాలు, మనుషులు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడే వాళ్లం. గత ఉప ఎన్నికల్లో మా కాలనీకి వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు పరిస్థితిని స్వయంగా చూపించగా, ఆయన వెంటనే స్పందించి రూ .15 లక్షలు మంజూరు చేశారు. 15 రోజుల్లోనే సీసీ రోడ్డు వేయించారు. తెలంగాణ ప్రభుత్వానికి మా కాలనీ మొత్తం రుణపడి ఉంటుంది.

*- కుతాడి కుమారస్వామి, తెలంగాణ ఎరుకల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు (ఏకలవ్య కాలనీ)*

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 25: గత కొన్ని సంవత్సరాలుగా ఎరుకలవాడ(ఏకలవ్య కాలనీ)లో సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల ఇక్కట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవతో తొలగిపోయాయి. గత ఉప ఎన్నికలకు ముందు రూ.15 లక్షలు మంజూరు చేయగా, పక్షం రోజుల్లో సైదాపూర్ క్రాస్ రోడ్‌లోని కర్రకోత మిషన్ నుంచి 30 ఫీట్ల సీసీరోడ్డు వేయడంతో కాలనీకి రాకపోకలు మెరుగుపడ్డాయి. ఏండ్ల తరబడి పడుతున్న ఇక్కట్లు తొలగిపోవడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# కేంద్ర సాయుధ బలగాల కవాతు


మండల కేంద్రంలో కవాతు చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు

వీణవంక, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు మండలానికి చేరుకున్నాయి. 40 మందితో కూడిన బృందం బుధవారం మండల కేంద్రానికి రాగా, ఎస్ఐ ఆసిఫ్ ఆధ్వర్యంలో వారితో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. వీధుల గుండా తిరుగుతూ, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆసిఫ్ మాట్లాడుతూ, ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా అపరిచితులు కనబడినా, ఏవైనా గొడవలు జరిగినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మండలంలోని 26 గ్రామాల్లో మొత్తం 55 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.